ఈనాడు తమిళనాడు

సోమవారం అక్టోబరు 14, 2024 5



శనివారం తెల్లవారుజామున చెన్నై సెంట్రల్ నుంచి దర్భంగా వైపు ప్రత్యేక రైలులో వెళ్తున్న బాధితులకు ఆహారపొట్లాలు అందిస్తున్న సిబ్బంది



దెబ్బతిన్న భాగమతి ఎక్స్‌ప్రెస్ ఇంజిన్ ముందుభాగం

శనివారం రాత్రి తిరువళ్లూరు జిల్లా కవరైపెట్టై రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే పెను ప్రమాదం జరిగింది. మైసూరు నుంచి బిహార్ రాష్ట్రం దర్భంగాకు వెళ్లే భాగమతి ఎక్స్‌ప్రెస్ లూప్ లైన్‌లో ఉన్న గూడ్స్ రైలును ఢీకొంది. కొందరు ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. ఎవరూ చనిపోలేదు. దీంతో రైల్వేయంత్రాంగం, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్ పరిధిలోని బహనగబజార్ రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలును కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ప్రమాదంలో 290మంది వరకు మరణించారు. మరో 900మంది వరకు గాయపడ్డారు. ఆ సమయంలో గూడ్స్ రైలు ముడి ఇనుము లోడ్‌తో ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగి మరణాలు అంతకంతకూ పెరిగాయనేది ఓ అంచనా. తాజాగా భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు లూప్‌లైన్‌లోని ఖాళీ గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఆ సమయంలో గూడ్స్ రైలులో నిండుగా సరకు ఉండుంటే పరిస్థితి వేరేగా ఉండేదని విశ్లేషకులు చెబుతున్నారు. గూడ్స్ ఖాళీగా ఉండటంతో ప్రమాద తీవ్రత తగ్గిందని భావిస్తున్నారు.

- ఈనాడు-చెన్నై

ఖాళీ గూడ్స్ వల్ల తగ్గిన ప్రమాద తీవ్రత!

- కవరైపెట్టై ఘటనలో తప్పిన ప్రాణాపాయం
- ప్రత్యేక రైలులో దర్భంగాకు బాధితుల పయనం



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిఉన్న బోగీలు

ఓ బోగీ కిందకు వెళ్లి పరిశీలిస్తున్న సీఆర్ఎస్ ఎ.ఎం.చౌదరి తదితరులు



బోగీలను క్రేన్‌లతో తరలిస్తున్న దృశ్యం

క్షతగాత్రులూ క్షేమం

భాగమతి రైల్లో ఎక్కువమంది ప్రయాణికులు బిహార్ వెళ్లేవారుండగా, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలకు వెళ్లేవారూ ఉన్నారు. ఎక్కువ గాయాలైన ముగ్గురికి స్టాన్లీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరి పరిస్థితి బాగుందని దక్షిణ రైల్వే చెప్పింది. మరికొందరు పొన్నేరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నారు. గాయపడిన ప్రయాణికులకు రైల్వే నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందని ప్రకటించారు. భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలులో 1800మందికి పైగా ప్రయాణించారని, దాదాపు అందరినీ చెన్నైకి ప్రత్యేక రైలులో ప్రమాదం జరిగినరోజు రాత్రే తీసుకొచ్చినట్లు వెల్లడించారు. వీరందరినీ శనివారం తెల్లవారుజామున ప్రత్యేక రైలులో వయా అరక్కోణం, రేణిగుంట, గూడూరు మీదుగా దర్భంగాకు పంపారు.

సహాయక చర్యల్లో 500మంది

ఘటనాస్థలంలో చెల్లాచెదురుగా బోగీలు పడటంతో రెండు ట్రాక్‌లు సుమారు 500 మీటర్ల మేర దెబ్బతిన్నాయి. శుక్రవారం రాత్రినుంచి వాటిని తొలగించే పనిలో సహాయసిబ్బంది నిమగ్నమయ్యారు. సుమారు 500మందికిపైగా సిబ్బంది, అలాగే క్రేన్లు, జేసీబీలు, ఇతర యంత్రాలతో పనులు చేశారు. ప్రమాదం జరిగిన రాత్రే అరగంటలోనే చెన్నై-గూడూరు సెక్షన్‌లోని ఓ ట్రాక్‌ను అందుబాటులోకి తెచ్చారు. కానీ ప్రధానలైన్లపై బోగీలు చెల్లాచెదురుగా పడటంతో విజయవాడ, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే సుమారు 20 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దుచేశారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో 7గంటల్లో పట్టాలను సాధారణస్థితికి తెచ్చారు. 8గంటల్లో ఓవర్‌హెడ్ విద్యుత్తు తీగలు, 8.30గంటల్లో సిగ్నలింగ్ వ్యవస్థను పునరుద్ధరించారు. శనివారం రాత్రి 9.05గంటలకు నిజాముద్దీన్ నుంచి సెంట్రల్‌కు వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను (12434) చెన్నైవైపు వెళ్లే పట్టాలపై అనుమతించారు. ఆదివారం ఉదయం 9.08గంటలకు చెన్నై, బెంగళూరు వైపునుంచి వెళ్లే లైనులో 12842 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌ను అనుమతించారు. మధ్యలో వర్షంపడినా పనులు ఆగలేదు.

30 మంది వద్ద విచారణ

దక్షిణ సర్కిల్ పరిధి రైల్వే భద్రతా విభాగ కమిషనర్ (సీఆర్ఎస్) ఎ.ఎం.చౌదరి తన బృందంతో కలిసి ఘటనాస్థలికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అక్కడ చెల్లాచెదురుగా పడిఉన్న కోచ్‌లు, ఇంజిన్‌లను చూడటంతో పాటు పట్టాలు, సిగ్నలింగ్ పాయింట్లను తనిఖీ చేశారు. కొన్ని మీటర్ల దూరంలోనే కవరైపెట్టై రైల్వేస్టేషన్ ఉండటంతో అక్కడికెళ్లి ప్యానెల్‌బోర్డు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాక్ వ్యవస్థ, కంట్రోల్‌ప్యానెల్‌లను పరిశీలించారు. భాగమతి ఎక్స్‌ప్రెస్‌ను నడిపిన ఇద్దరు లోకోపైలెట్లతో పాటు మొత్తం 30మంది నుంచి అభిప్రాయాలను రికార్డుచేశారు. కవరైపెట్టై స్టేషన్ మేనేజర్ ఎం. మునిప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు ఈ విచారణ కొనసాగిస్తున్నారు. ప్రాథమిక నివేదిక ఇవ్వడానికి 10-15రోజులు పట్టొచ్చని బృంద సభ్యులు సూచాయిగా వెల్లడించారు. ఈ రైలు ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టే బాధ్యతను సీఆర్ఎస్ ఎ.ఎం. చౌదరికి అప్పగించారు. ఈనెల 16, 17 తేదీల్లో చెన్నై డివిజన్ డీఆర్ఎం సమావేశ మందిరంలో ఆయన విచారణ చేడపుతున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. 13 మందికి దక్షిణ రైల్వే సమన్లను జారీచేసింది. ఇందులో కవరైపెట్టై స్టేషన్ మాస్టర్‌తో పాటు లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, సిగ్నల్ ఆపరేటర్లు తదితరులున్నారు.

సాయపడిన స్థానికులు

ముందుగా పెద్ద శబ్దం వచ్చిందని, ఆ తర్వాత మంటలు వ్యాపించాయని కవరైపెట్టై గ్రామస్థులు చెబుతున్నారు. వారు వెంటనే అప్రమత్తమై ప్రయాణికులకు సాయపడగా.. అరగంటలోపే పోలీసులూ, ఇతర సహాయక సిబ్బంది వచ్చేశారు. తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం (టీఎంఎంకే), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రతినిధులు సైతం అక్కడికి చేరుకుని సహాయకచర్యల్లో పాల్గొన్నారు. స్థానికంగా ఇందియ మనిదనేయ జననాయగ కట్చి సభ్యులూ వచ్చారు. దక్షిణ రైల్వే ఉన్నతాధికారులు దగ్గరుండి సహాయచర్యల్ని పర్యవేక్షించారు.

చెన్నై సహా నాలుగు జిల్లాలకు

రెడ్ అలర్ట్

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై సహా నాలుగు జిల్లాలకు 16వ తేదీ వాతావరణ పరిశోధన కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈశాన్య రుతుపవనాలు 15వ తేదీ రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని, బంగాళాఖాతంలో 14న ఏర్పడే అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుందని, ఇది ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ సముద్రతీరాల వైపు ప్రయాణిస్తుందని తెలిపింది. ఈ కారణంగా తమిళనాడులో అతి భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. 14న రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, విళుపురం, కడలూరు, అరియలూరు, పెరంబలూరు, మైలాడుతురై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టిణం, పుదుక్కోట్టై జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతిభారీవర్షాలు, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, తిరుచ్చిరాపల్లి, శివగంగై, రామనాథపురం జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురుస్తుందని పేర్కొంది. 15న ఉత్తర తమిళనాడులో చాలా చోట్ల, దక్షిణ తమిళనాడులో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుందని, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలు, పుదుచ్చేరిలో ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీవర్షాలు, వేలూరు, తిరుప్పత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, ఈరోడు, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టిణం, మైలాడుతురై జిల్లాలు, కారైక్కల్‌లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురుస్తుందని చెప్పింది. 16న ఉత్తర తమిళనాడులో చాలా చోట్ల, దక్షిణ తమిళనాడులో కొన్నిచోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుందని, చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల అతి భారీ నుంచి అత్యంత భారీవర్షాలు కురుస్తాయని వివరించింది. 17న రాష్ట్రంలో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని, తిరరువళ్లూరు, రాణిపేట, వేలూర్, తిరుప్పత్తూరు, కృష్ణగిరి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, చెన్నై, కాంచీపురం, తిరువణ్ణామలై, ధర్మపురి, సేలం, ఈరోడు జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. తమిళనాడు సముద్రతీర ప్రాంతాలు, గల్ఫ్ ఆఫ్ మన్నార్, కన్నియాకుమరి సముద్ర ప్రాంతాల్లో గంటకు 35 నుంచి 45 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని ఆ ప్రాంతాలకు 15 వరకు జాలర్లు వెళ్లకూడదని హెచ్చరించింది.

శంకరలింగనార్ త్యాగానికి

రుణపడిన రాష్ట్రం : ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: శంకరలింగనార్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశాన్ని పోస్టు చేశారు. అందులో.. శంకరలింగనార్ చూపిన త్యాగమార్గంలో పయనించడం అందరికీ సాధ్యం కాదన్నారు. ఆయన త్యాగాన్ని మరిచిన వారు, నిరాకరించే వారు తమిళులు కాబోరని, మనుషులు కాబోరని దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రానికి తమిళనాడు అని పేరు పెట్టాలని 76 రోజులు నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలు అర్పించిన రోజు ఇదన్నారు. ఆ త్యాగానికి తమిళనాడు సదా రుణపడి ఉంటుందని తెలిపారు.

బాబా సిద్ధిఖీ హత్య దారుణం..

చెన్నై: ఎన్సీపీ (అజిత్ పవార్ పక్షం) సీనియర్ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ దారుణ హత్య దిగ్భ్రాంతిని, ఆవేదనను కలిగించిందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. పౌర సమాజంలో ఇలాంటి హింసాత్మక చర్యలకు చోటు లేదన్నారు. ఇది తీవ్రంగా ఖండించదగిందన్నారు. బాబా సిద్ధిఖీ కుటుంబ సభ్యులకు, ఆయన పార్టీ శ్రేణులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆదివారం గోపాలపురంలోని దివంగత మురసొలి సెల్వం నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సోదరి సెల్విని ఓదార్చారు. వెంట భాజపా శాసనసభాపక్ష నేత నయినార్ నాగేంద్రన్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి ఉన్నారు. - న్యూస్‌టుడే, చెన్నై



వర్షాకాల సన్నాహాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి





- ఫోన్‌కాల్ స్వీకరించి మాట్లాడుతున్న ఉదయనిధి
- క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న వర్షాకాల సన్నాహాలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరిశీలించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయమైన రిప్పన్ బిల్డింగ్‌లో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్, కంట్రోల్ సెంటర్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈశాన్య రుతుపవనాలను పురస్కరించుకుని నగరంలో కార్పొరేషన్ తరఫున చేపట్టిన చర్యలు, ఇతర ఏర్పాట్లను మానిటర్ ద్వారా పరిశీలించారు. 1913 కంట్రోల్ రూమ్‌కి వచ్చిన ఫోన్ కాల్స్‌ను స్వీకరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వెంట మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనరు కుమారగురుభరన్ తదితరులున్నారు.

రైలు ప్రమాద బాధితులకు పరామర్శ

చెన్నై: చెన్నై నగర శివారు కవరపేట్టైలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరామర్శించారు. 19 మంది క్షతగాత్రులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఆదివారం పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులను సొంతూర్లకు పంపడానికి చేస్తున్న ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

విమాన కెప్టెన్‌కు ముఖ్యమంత్రి అభినందన

చెన్నై, న్యూస్‌టుడే: తిరుచ్చి నుంచి షార్జాకు బయలుదేరిన విమానంలో యాంత్రిక లోపం తలెత్తగా సురక్షితంగా కిందికి దించిన కెప్టెన్, కోపైలట్‌లు, విమాన సిబ్బందిని ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందించారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సురక్షితంగా కిందికి దిగిందని తెలిసి ఊరట చెందానన్నారు. విమానం కిందకు దిగడంలో సమస్య ఉందని తెలిసిన వెంటనే అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి, అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్, వైద్య సహాయాలు తదితర అన్ని ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించినట్టు తెలిపారు. ప్రయాణికుల భద్రతను ధ్రువీకరించాలని, వారికి తదుపరి సహాయాలు అందించాలని కలెక్టరుకు సూచించినట్టు పేర్కొన్నారు. సురక్షితంగా విమానాన్ని కిందికి దించిన కెప్టెన్, విమాన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

గవర్నర్... చెన్నై: గవర్నర్ ఆర్ఎన్ రవి తన 'ఎక్స్' పేజీలో.. క్లిష్ట పరిస్థితుల్లో కాక్‌పిట్, క్యాబిన్ బృందం సాహసోపేతమైన, తొందరపాటు లేని వృత్తి విధాన వైఖరి అభినందనీయమన్నారు. విమానంలో అందరి భద్రతను ధ్రువీకరించిన, అత్యవసర సేవల్లో పాల్గొన్న అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

వైజ్ఞానిక యుగంలోనూ రైలు ప్రమాదాలు సరికాదు: కమల్‌హాసన్

చెన్నై: వైజ్ఞానిక యుగంలోనూ రైలు ప్రమాదాలు ఆమోదయోగ్యం కాదని మక్కళ్ నీది మయ్యం అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో.. కవరపేట్టైలోని రైలు ప్రమాద బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ వైజ్ఞానిక యుగంలో రైలు ప్రమాదాలను ఆమోదించలేమని తెలిపారు. అమూల్యమైన మానవ ప్రాణాలు నిర్లక్ష్యం కారణంగా కోల్పోకూడదని పేర్కొన్నారు.







- స్వామివారికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు
- చక్రస్నానం కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకృష్ణ, పార్థసారథి, మోహన్‌రావు తదితరులు
- ఏఈవో పార్థసారథికి వెండి పాత్రను అందజేస్తున్న భక్తుడు

వైభవంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

టీనగర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చెన్నై టీనగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ఆస్థాన అలంకారం, పట్టాభిషేకం, మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఈ నెల మూడో తేదీ నుంచి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అప్పటి నుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్వామివారు పలు అవతారాలు, అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చివరి రోజైన శనివారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం పట్టాభిషేకం జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈవో పార్థసారథి, నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● శనివారం కార్యక్రమాలకు తితిదే చెన్నై స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షులు శ్రీకృష్ణ ఉభయదారులుగా వ్యవహరించారు. ఠాగూర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మణికంఠన్ తదితరులు మరికొన్ని కార్యక్రమాలకు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా చెన్నైకి చెందిన డా.హరిప్రకాష్ అనే భక్తుడు స్వామివారి తులసి అర్చనకు వినియోగించడానికి 1.750 కిలోల బరువున్న వెండి పాత్రను కానుకగా ఏఈవోకు అందజేశారు. స్థానిక సలహామండలి మాజీ సభ్యులు మోహన్ రావు, తితిదే సిబ్బంది శీను తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లోనూ..

చెన్నై: రాజ్‌భవన్‌లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన శనివారం చిన్మయా సోదరీమణులు ఉమ, రాధిక బృందం భక్తిగీతాలాపన, వినాయక నాట్యాలయ విద్యార్థినుల భరతనాట్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమాలను గవర్నరు ఆర్ఎన్ రవి, దంపతులు తిలకించారు. అనంతరం కళాకారులను గవర్నరు దంపతులు జ్ఞాపికతో సత్కరించారు.



చెన్నై: కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న గవర్నరు రవి దంపతులు

ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖలో అవకతవకలు: ఎడప్పాడి

సైదాపేట, న్యూస్‌టుడే: ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖలో జరిగే అవకతవకలను అడ్డుకోని డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిసామి తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అమ్మ (అన్నాడీఎంకే) ప్రభుత్వంలో ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖ తరఫున పలు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆదిద్రావిడ, గిరిజన రచయితలకు ఇచ్చే ప్రోత్సాహ నిధి రూ.40 నుంచి రూ.50 వేలకు పెంచామని తెలిపారు. అదేవిధంగా అంత్యక్రియల సాయం రూ.2,500 నుంచి రూ.5 వేలకు, ఆదిద్రావిడ ప్రజలు లబ్ధి పొందేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ హాళ్లు, ముఖ్యమంత్రి హరిత గృహ వసతి పథకం కింద 2020-21 ఏడాదిలో 8,800 కుటుంబాలకు రూ.265 కోట్లతో ఇళ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. అయితే డీఎంకే ప్రభుత్వం ఏటా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదిద్రావిడ ప్రజలకు వచ్చే నిధులను పూర్తిగా ఉపయోగించకుండా తిరిగి పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమశాఖలో తొల్‌కుడి అనే పథకం కింద గిరిజనుల అభివృద్ధి కోసం కేటాయించే వందల కోట్ల నిధిని దుర్వినియోగం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని ఆరోపించారు. ఇకనైనా శాఖకు కేటాయించే నిధిని పూర్తిగా పథకాలకే ఉపయోగించాలని డిమాండ్ చేశారు.

వానాకాల ముందస్తు ఏర్పాట్ల పరిశీలన



వాననీటి పారుదల కాలువ అనుసంధాన పనులను పరిశీలిస్తున్న కమిషనరు

చెన్నై, న్యూస్‌టుడే: వర్షాకాల ముందస్తు ఏర్పాట్లను చెన్నై మహానగర కార్పొరేషన్ కమిషనరు డాక్టర్ జె.కుమారగురుభరన్ పరిశీలించారు. తేనాంపేట జోన్ సీఐటీ నగర్‌లోని చెన్నై మహోన్నత పాఠశాల, అన్నానగర్ జోన్ బుల్లా అవెన్యూ, చెన్నై మహోన్నత పాఠశాలలోని సహాయక శిబిరాలను, అక్కడ సిద్ధంగా ఉన్న ఏర్పాట్లను పరిశీలించారు. తిరువీకా జోన్ ఎస్పార్పీ కోయిల్ వీధి ఉత్తర ప్రాంతంలో చేపట్టిన వాననీటి కాలువ అనుసంధాన పనులను పరిశీలించారు. వెంట డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, చీఫ్ ఇంజినీరు రాజేంద్రన్ తదితరులున్నారు.

గ్రూప్-4 పోస్టులు 15 వేలకు పెంచాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-4 పోస్టుల భర్తీకి ఈ ఏడాది టీఎన్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహించిందని, ఆ ఖాళీలను కనీసం 15,000కు పెంచాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... టీఎన్‌పీఎస్సీ ద్వారా గ్రూప్-1, 2, 3, 4 తదితర పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించినా గ్రూప్-4 ఖాళీల సంఖ్య లక్షల్లో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సాధారణంగా గ్రూప్-4 పోస్టులను పేద, బడుగు వర్గాల యువకులు సాధిస్తారని, ఈ నేపథ్యంలో ఖాళీల సంఖ్య తక్కువగా ప్రకటించిన నేపథ్యంలో కటాఫ్ మార్కులు పెరిగినట్లు, తద్వారా గ్రామీణ ప్రాంత యువకులకు ప్రభుత్వ ఉద్యోగం అందని ద్రాక్షగా ఉన్నట్లు అభ్యర్థులు వాపోతున్నారని తెలిపారు. గ్రూప్-4 పరీక్ష రాసిన అభ్యర్థులకు యూనీఫార్మల్ ఉద్యోగాలతో కలిపి మొత్తం 8,932 ఖాళీలు మాత్రమే ప్రకటించటం దిగ్భ్రాంతికర విషయమన్నారు. కావున ఖాళీలను కనీసం 15 వేలకు పెంచాలనే డిమాండ్లు వస్తున్నాయని చెప్పారు. ఆ మేరకు పెంచేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

కమనీయం.. శూరసంహారం



కార్యక్రమం తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

ప్యారిస్, న్యూస్‌టుడే: తూత్తుక్కుడి జిల్లా కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయ దసరా ఉత్సవాల్లో భాగంగా ముఖ్య ఘట్టమైన శూరసంహారం శనివారం అర్ధరాత్రి ఘనంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు విచ్చేసి తిలకించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. రాత్రి 11 గంటల సమయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అర్ధరాత్రి సింహ వాహనంపై అలంకరించి సముద్రతీరంలో ఉన్న చిదంబరేశ్వరర్ ఆలయం ఎదుటకు తీసుకొచ్చారు. అక్కడ మహిషాసురుడి వధ నిర్వహించారు. శూరసంహారాన్ని వీక్షించేందుకు సముద్రతీరంలో లక్షల మంది భక్తులు గుమిగూడారు. తర్వాత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చోటుచేసుకున్నాయి.

ధర్మసంస్థాపనకే దశావతారాలు



ఉపన్యాసకుడితో పాలకమండలి సభ్యులు

ప్యారిస్, న్యూస్‌టుడే: శ్రీ మహావిష్ణువు దశావతారాలు ధర్మ సంస్థాపనకేనని ప్రముఖ ఉపన్యాసకులు డాక్టర్ వెంకటేశ్వర్లు అభివర్ణించారు. పప్పు శెట్టి రామయ్యశెట్టి ధర్మ సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ నగర్‌లోని వీజీపీ సెంటినరీ హాల్‌లో ఆదివారం ఆధ్యాత్మిక ఉపన్యాసం ఏర్పాటైంది. 'గీతా రామం' అంశంపై ఉపన్యాసకులు ప్రసంగిస్తూ.. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పరిపూర్ణ అవతారాలని, మానవాళికి ఆరాధ్యులని తెలిపారు. ప్రత్యేకించి శ్రీరాముడు తాము స్వయంగా ఆచరించి, శ్రీకృష్ణుడి గీతా బోధనల ద్వారా మానవాళి ఎలా జీవించాలని వివరంగా తెలిపారన్నారు. ఒకరు ఆచరణలో చెబితే మరొకరు బోధనల ద్వారా మార్గనిర్దేశం చేశారన్నారు. ముందుగా పాలకమండలి సభ్యులు ఉమ్మిడి సుధాకర్, ఏఎస్ హరిప్రసాద్, కోటా సుధాకర్, జీవీ బాలాజీ ఉపన్యాసకులను సత్కరించారు.

ఎమ్మార్టీఎస్ రైళ్ల ఆధునికీకరణ ఆలస్యం

'సీఎంఆర్ఎల్' ఆధీనంలోకి తీసుకోవడానికి సన్నాహాలు

- న్యూస్‌టుడే, వడపళని

దక్షిణ రైల్వే పరిధిలో నడుస్తున్న మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎమ్మార్టీఎస్) రైళ్లను ఆధునికీకరించేందుకు చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) తన ఆధీనంలోకి తీసుకోవాలనుకుంది. ఇందుకు రైల్వే బోర్డు నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తోంది. ఈ ప్రతిపాదన జరిగి ఇప్పటికే పదేళ్లు దాటింది. గత రెండేళ్లుగా దీనిపై పనులు కాస్త ముందుకు సాగాయి. ఈ ఏడాది మొదట్లో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదన రైల్వే బోర్డుకు సమర్పించారు. పార్లమెంటు ఎన్నికలు అడ్డురావడంతో ఆ ప్రక్రియ ముగిసిన తర్వాత జులైలో బోర్డు నుంచి అనుమతి లభిస్తుందనుకున్నారు. రైల్వే బోర్డులోని ఇంజినీరింగు, ఫైనాన్స్, వాణిజ్య విభాగాలు కొన్ని సందేహాలు లేవనెత్తాయి. దీంతో వాటిని పరిష్కరించేందుకు 'గతి శక్తి డైరెక్టరేట్'కు అప్పగించారు. వారడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు కూడా సిద్ధం చేశారు. వచ్చే నెలకల్లా సానుకూల సమాధానం వస్తుందనే ఆశాభావాన్ని అధికారి ఒకరు వ్యక్తం చేశారు.



స్టేషన్ల సుందరీకరణ

ఎమ్మార్టీఎస్ సీఎంఆర్ఎల్ చేతిలోకి వచ్చిన తర్వాత స్టేషన్ల స్థాయి పెంచి, పరిసరాలను ఆధునిక పద్ధతులతో సుందరీకరించనున్నారు. ఈ పనులన్నీ సీఎంఆర్ఎల్ కాకుండా రైల్వే విభాగమే చూసుకుంటే ఎలా ఉంటుందనే దానిపై కూడా ఆలోచిస్తున్నామని మెట్రో అధికారి ఒకరు పేర్కొన్నారు. గతి శక్తి డైరెక్టరేట్ నుంచి అనుమతి అందగానే తుది అనుమతి కోసం కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపుతారు. ఇవన్నీ జరగడానికి మరి కొంతకాలం పట్టనుంది. ప్రయాణికులు త్వరగా ఎమ్మార్టీఎస్ స్టేషన్లలో అభివృద్ధి పనులు జరగాలని ఎదురుచూస్తున్నారు. ఎమ్మార్టీఎస్ రైళ్లలో ఏసీ బోగీలు కూడా ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదనల్లో ఒకటిగా ఉంది.



సమావేశంలో పాల్గొన్న అప్పావు, కేఎన్ నెహ్రూ, అధికారులు

వర్షా కాల ముందస్తు చర్యలపై సమీక్ష

టీనగర్, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరునెల్వేలి జిల్లాలో ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆదివారం రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ, స్పీకర్ అప్పావు నేతృత్వంలో సమీక్ష జరిగింది. వన్నారపేట ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కార్తికేయన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, వరద బాధితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లను ముందుగానే చేపట్టాలని అధికారులకు సూచించారు.

6 నెలల్లో 1,141 బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 6 నెలల్లో 1,141 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బాల్య వివాహాలను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ద్వారా పలు చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. మహిళలపై జరిగే నేరాలను, బాల్య వివాహాలను అడ్డుకునేందుకు 1098 ఉచిత టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసింది. కళాశాలలు, పాఠశాలల్లో అధికారులు అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నారు. బాల్య వివాహాలను అడ్డుకుని బాలికలను హోంకు తరలిస్తున్నారు. బాల్య వివాహాలకు సంబంధించి జనవరి నుంచి ఆగస్టు వరకు 2631 ఫిర్యాదులు అందాయని వీటి ద్వారా 1141 వివాహాలను అడ్డుకున్నామని, 1373 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్ సంతకం ఫోర్జరీ.. ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా నైవేలి సమీప వడలూర్-విరుదాచలం మార్గంలో ఊ-మంగళం పోలీస్ స్టేషన్ ఉంది. ఇక్కడ ప్రత్యేక సెక్షన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంగుబాలన్, క్లర్క్ గౌతమ్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ కలిసి ఎన్ఎల్సీ కంపెనీలో వివిధ విభాగాల్లో రోజువారీ వేతనాలు, ఒప్పంద విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఇన్‌స్పెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిరభ్యంతర ధ్రువపత్రాలు జారీచేసినట్లు జిల్లా ఎస్పీ రాజారామ్‌కు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై ఏర్పాటైన ప్రత్యేక పోలీస్ బృందం జరిపిన దర్యాప్తులో ముగ్గురు కానిస్టేబుల్స్ మోసానికి పాల్పడినట్లు తేలింది. ఆ మేరకు నివేదికను ఎస్పీకి అందజేశారు. ఈ నేపథ్యంలో ముగ్గురిని సస్పెండు చేస్తూ ఆదివారం ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

తాగునీటి వినియోగదారుల సమావేశం 19న

వడపళని, న్యూస్‌టుడే: ప్రతి నెలా మెట్రోవాటర్ విభాగం ఆధ్వర్యంలో జరిగే వినియోగదారుల సమావేశం 12వ తేదీ దసరా పండుగ కావడంతో 19వ తేదీకి వాయిదా వేసినట్టు పేర్కొంది. ఆ రోజు తిరువొత్తియూరు, మనలి, మాధవరం తదితర ప్రాంతాల్లోని ప్రాంతీయ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు సమావేశం ఉంటుందని, తాగునీటి సరఫరా, మురుగునీటి సమస్యలు, పెండింగ్‌లో ఉన్న కనెక్షను వంటి వాటిపై సీనియర్ ఇంజినీరుతో చర్చించి పరిష్కరించుకోవచ్చని తెలిపింది.

కూవం తీరంలో శుభ్రతా పనులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నగరంలో కూవం నది శుభ్రతా పనుల్లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నిమగ్నమైంది. రుతుపవనాలు ప్రవేశిస్తున్న తరుణంలో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) అక్టోబరు 10వ తేదీ గడువు విధిస్తూ కూవం వెంబడి శుభ్రతా పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. కూవం ఒడ్డున ఉన్న 89 తాత్కాలిక భవన శిథిలాల్లో (డెర్బీస్) శనివారం నాటికి 85 తొలగించింది. ఎగ్మూరులోని లాంగ్స్ గార్డెన్ రోడ్డులోని కూవం నది ఒడ్డున శనివారం రాత్రికి తొలగిస్తామని ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది. కోయంబేడు, తిరుమంగళం, పాడికుప్పం, అమింజికరై ప్రాంతాల్లో తొలగించి తీరాలకు తరలించారు. చెన్నై పోర్ట్ నుంచి మదురవోయల్ వరకు రూ.5,885 కోట్ల వ్యయంతో చేపడుతున్న పొడవైన మార్గానికి కూవం వెంబడి ఉన్న 273 పాత స్తంభాలు తొలగించి కొత్త వాటిని నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ శిథిలాలను అక్కడకు చేర్చింది. ఇప్పుడు ఎన్జీటీ ఆదేశం మేరకు నదీతీరానికి చేరవేసినట్టు తెలిపారు. అక్కడ పారేసిన వాటిని ఏమి చేయవద్దని జలవనరుల అభివృద్ధి విభాగ అధికారులు పేర్కొన్నారు. బాగా ఎత్తుగా పేరుకుపోవడంతో నదుల వెడల్పు తక్కువగా ఉన్న ప్రాంతాలనుంచి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవచ్చన్నారు. శిథిలాలతో సరి చేయనుండటంతో ప్రహరీ ఎత్తును పెంచడం లేదని ఎన్‌హెచ్ఏఐ అధికారి పేర్కొన్నారు.



వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో పుదూర్ అప్పుపై గూండా చట్టం నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టయిన రౌడీషీటర్ పుదూర్ అప్పుపై గూండా చట్టం కింద చర్యలు చేపట్టారు. ఈ కేసులో 27 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో 25 మందిపై గూండా చట్టం నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 21న దిల్లీలో రౌడీ పుదూర్ అప్పుని పోలీసులు అరెస్టు చేసిన క్రమంలో ప్రస్తుతం అతనిపై గూండా చట్టం నమోదు చేశారు. అదేవిధంగా రౌడీ శంబో సెంథిల్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

ఫ్రెంచ్ కాన్సులేట్‌కి బాంబు బెదిరింపులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నైలో కొన్ని నెలలుగా ప్రైవేటు పాఠశాలలు, విమానాశ్రయం మొదలైన ప్రాంతాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం గోపాలపురంలోని ఓ పాఠశాల, నుంగంబాక్కంలోని ప్రైవేటు పాఠశాల ఈ-మెయిల్‌కు బెదిరింపులు వచ్చాయి. ఆదివారం మైలాపూర్ రాధాకృష్ణన్ సాలైలోని ఫ్రెంచ్ కాన్సులేట్ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. రాయపేట పోలీసులు, బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టి అవి ఉత్తుత్తి బెదిరింపులుగా తేల్చారు. రెండు రోజుల క్రితం పుదుచ్చేరిలోని ఫ్రెంచ్ కాన్సులేట్‌కి ఇదేవిధంగా బెదిరింపులు రావడం గమనార్హం.

తిరుచ్చిలో హోటళ్లకు...

ఆర్కేనగర్: తిరుచ్చిలోని నాలుగు ప్రముఖ హోటళ్లలో బాంబు ఉందని ఆదివారం పోలీసుశాఖ ఈ-మెయిల్‌కు బెదిరింపు సందేశాలు వచ్చాయి. వెంటనే పోలీసులు బాంబు స్క్వాడ్‌తో సదరు హోటళ్లలో సోదా చేశారు. ఎలాంటి ప్రమాదకర వస్తువులు దొరకలేదు.

ప్రధాని విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: సీపీ రాధాకృష్ణన్

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. నమో విద్యా ఛారిటబుల్ ఫౌండేషన్ తరఫున ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని 1,000 మంది విద్యార్థులకు ఆర్థికసాయం అందజేత కార్యక్రమం, తమిళనాడుకు చెందిన పారాలింపిక్స్ విజేతలకు అభినందన కార్యక్రమం శనివారం చెన్నైలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ... తమిళనాడుకు 11 వైద్య కళాశాలలు ఇచ్చిన నాయకుడు ప్రధాని మోదీయేనని పేర్కొన్నారు. తమిళుల ఆతిథ్యం గొప్పదనాన్ని ప్రపంచానికి చాటారని తెలిపారు. తన పార్టీకి ఒక్క ఎంపీని ఇవ్వని తమిళనాడులోని చెన్నై, వేలూర్, సేలం, ఈరోడు, తిరుప్పూరు, కోయంబత్తూరు, మదురై, తిరునెల్వేలి, తూత్తుక్కుడి, తిరుచ్చి నగరాల్లో స్మార్ట్ సిటీ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అందరి బాధ్యతని తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుమ్మిడిపూండి ప్రాంతంలో పలు చోట్ల సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **రేపు... కాంచీపురం, న్యూస్‌టుడే:** కాంచీపురం సమీప శిరుకావేరిపాక్కం, వైట్ గేట్ ప్రాంతాల్లోని 250 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల్లో 15వ తేదీ మాసాంతర అత్యవసర మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కీళ్ అంబి, పళ్లంబి, శిరుకావేరిపాక్కం, దిమ్మసముద్రం, కరుపట్టితట్టడై, జేజేనగర్, పుదుపాక్కం, పెరియకరుంబూర్, చిత్తేరిమేడు మొదలైన గ్రామాల్లో సరఫరా ఉండదు.

శునకం అదృశ్యం.. కనిపెడితే రూ.5 వేల బహుమానం



ఏర్పాటు చేసిన పోస్టరు

ప్యారిస్, న్యూస్‌టుడే: అదృశ్యమైన శునకాన్ని వెతికిపెడితే రూ.5 వేల నగదు బహుమతి ఇస్తామని మదురైలో ఏర్పాటు చేసిన పోస్టరు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అందులో.. మదురై నగరంలోని శివగంగై రోడ్డు గోమతినగర్‌లోని ఓ ఇంట్లో పెంచుకుంటున్న 'మ్యాంగో' అనే పేరుగల శునకం మంగళవారం కనిపించకుండా పోయిందని, బ్రౌన్ కలర్‌లో ఉంటుందని, పేరు, ఫోన్ నెంబరుతో కూడిన బెల్ట్ మెడకు కట్టి ఉందని, శునకాన్ని గుర్తించి ఇచ్చిన వారికి రూ.5 వేల నగదు బహుమతి ఇస్తామని ఉంది. దీని గురించి శునకం యజమాని సంఘవి మాట్లాడుతూ... తాను చెన్నైలోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తున్నానని, నాలుగేళ్ల క్రితం తాము ఉంటున్న నివాస ప్రాంతంలో తిరుగుతున్న శునకాన్ని పెంచుకుంటున్నట్లు తెలిపారు. మదురైలో ఉన్న పుట్టింటికి తీసుకురాగా మంగళవారం కనిపించకుండా పోయినట్లు పేర్కొన్నారు.

జీవన్మృతుడి అవయవాల దానం

టీనగర్, న్యూస్‌టుడే: తూత్తుక్కుడి జిల్లా సాత్తాన్‌కుళం సమీప పుదుక్కుళం గ్రామానికి చెందిన మంత్రమూర్తి నయినార్ (50) గత 10వ తేదీ దిశయన్‌విలై ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తిరునెల్వేలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జీవన్మృతి చెందాడు. అతని అవయవాలు దానం చేయడానికి కుటుంబీకులు ముందుకొచ్చారు. ఆ మేరకు వైద్యులు అవయవాలను తొలగించారు. ఆదివారం ఆస్పత్రి డీన్ రేవతి బాలన్ నేతృత్వంలో అతని మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆస్పత్రిలో మంత్రి ఆకస్మిక తనిఖీ



సిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న మా సుబ్రమణియన్

టీనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లా ఓమలూర్ ప్రభుత్వ వైద్యశాలలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి మా సుబ్రమణియన్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వైద్యులు, సిబ్బంది పనితీరు, వసతులు తదితరాలపై ఆరా తీశారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంట జిల్లా కలెక్టర్ బృందాదేవి, ఉన్నతాధికారులు ఉన్నారు.



శ్రీరంగం ఆలయంలో కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్

రాహుల్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: ఎల్.మురుగన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కవరైపేట రైలు ప్రమాదంపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఆయన శనివారం తిరుచ్చి శ్రీరంగం రంగనాథస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... తిరువళ్లూరు జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం, తిరుచ్చి-షార్జా విమానంలో యాంత్రికలోపం తలెత్తిన ఘటనల గురించి విచారణ జరుగుతున్నాయని చెప్పారు. గత పదేళ్ల భాజపా పాలనలో రైలు ప్రమాదాలు తగ్గాయన్నారు. రైలు ప్రమాదంపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. అన్ని విషయాలను రాజకీయం చేయకూడదన్నారు.

ఎడప్పాడి ఆరోపణలు అర్థరహితం

టీనగర్, న్యూస్‌టుడే: కలైజ్ఞర్ పార్కులో పర్యాటకులకు భద్రత లేదన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆరోపణలను రాష్ట్ర మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం ఖండించారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో.. ప్రభుత్వం అన్ని విధాలా భద్రతతోనే పార్కును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్కు సందర్శనకు పిల్లలకు రూ.50, పెద్దలకు రూ.100 వంతున రుసుము వసూలు చేస్తున్నట్లు తెలిపారు. పక్షుల సందర్శన, జిప్ లైన్ తదితరాలకు నామమాత్రంగానే రుసుము వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయినా ఎడప్పాడి ప్రభుత్వాన్ని విమర్శించడంపైనే దృష్టి సారిస్తున్నారన్నారు. ఒకప్పుడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళతో సన్నిహితంగా ఉన్న కృష్ణమూర్తి అనే వ్యక్తి నుంచి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకుని అందులో పార్కును ఏర్పాటు చేసినందునే ఆయనకు కోపం వచ్చిందన్నారు. పార్కులో జిప్‌లైన్ మరమ్మతులకు గురైన వ్యవహారంపై స్పందిస్తూ.. కొన్ని సెకన్లు మాత్రమే పర్యాటకులు అందులో చిక్కుకున్నారని, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి వారిని కిందకు చేర్చారని తెలిపారు.

ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ-బుక్స్ సదుపాయం

వడపళని, న్యూస్‌టుడే: అన్నా వర్సిటీ 'ఈ-రిసోర్స్ కన్సార్టియం'లో భాగంగా 300 పైగా ఇంజినీరింగు కళాశాలలు 20వేల ఈ-బుక్స్, 30 వేల ఈ-జర్నల్స్ ప్రయోగాత్మకంగా ఈ వారం నుంచి చూసుకునే వీలుంటుంది. మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ-బుక్స్, వీడియోలు, ఇంజినీరింగు జర్నల్స్‌ను అన్నా వర్సిటీ వేదికగా వారివారి గాడ్జెట్లు, ల్యాప్‌టాప్‌లలో వీక్షించవచ్చని వర్సిటీ పేర్కొంది. దీనిపై కళాశాలల ప్రిన్సిపల్స్, లైబ్రేరియన్లతో ఇటీవల సమావేశం కూడా జరిగింది. ప్రయోగాత్మకంగా ఈ వారం నుంచి ప్రారంభమవుతుందని, పూర్తి స్థాయిలో 2025 జనవరి నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొంది. కొద్ది మంది మాత్రమే లైబ్రరీకి స్వయంగా రాగలుగుతున్నారని, ఈ-బుక్స్ విధానంతో విద్యార్థుల సంఖ్య బాగా పెరుగుతుందన్నారు. ఈ వారం నుంచి ప్రారంభంకానున్న సేవలతో వచ్చే స్పందనను బట్టి వచ్చే సంవత్సరం మరికొన్ని మార్పులు చేయనున్నట్లు కొంగు ఇంజినీరింగు కళాశాల ప్రిన్సిపల్ వి.బాలుస్వామి పేర్కొన్నారు. అన్నా వర్సిటీలో అవలంబిస్తున్న నూతన పద్ధతిని ఇతర వర్సిటీల్లో కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కన్సార్టియం పద్ధతిలో యూజీ విద్యార్థులు ఏడాదికి రూ.500, పీజీ విద్యార్థులు రూ.1,500, పీహెచ్‌డీ స్కాలర్లు రూ.3 వేలు రుసుముగా చెల్లించాలి. అన్నా వర్సిటీ ప్రవేశపెట్టిన కొత్త విధానంతో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా వెసులుబాటుగా ఉంటుందని మాజీ ఉపకులపతి ఆర్.వేల్‌రాజ్ అన్నారు.

షెడ్యూల్డ్ కులాలను మోసగిస్తున్న ప్రభుత్వం: పుదువై అన్నాడీఎంకే



విలేకరులతో మాట్లాడుతున్న అన్బళగన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో షెడ్యూల్డ్ కులాల ప్రజలను ప్రభుత్వం మోసగిస్తోందని రాష్ట్ర అన్నాడీఎంకే కార్యదర్శి అన్బళగన్ విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 50ఏళ్ల క్రితం స్థిరపడి తమ స్థల, నివాస, జనన ధ్రువీకరణపత్రాలు నమోదు చేసుకోని షెడ్యూల్డ్ కులాల ప్రజలకు తగిన గుర్తింపు ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరిస్తుందని చెప్పారు. బాధితుల్లో కొందరు మద్రాసు హైకోర్టులో కేసు వేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయం పొందారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున పిటిషన్ వేశారని, అయితే ప్రభుత్వ అప్పీల్‌ని సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. తల్లిదండ్రుల ఆవాసాన్ని పరిగణలోని తీసుకునేటప్పుడు తల్లి జన్మస్థలాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పుదుచ్చేరి ప్రభుత్వం అమలుచేయాలని తెలిపారు. పుదుచ్చేరిలో జన్మించిన మహిళల నివాస ప్రాంతం ఆధారంగా తగిన ధ్రువపత్రాలు ఇచ్చేందుకు ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు.

భవిష్యత్తులో రైలు ప్రమాదాలు జరగకుండా చూడాలి: సీపీఎం

చెన్నై, న్యూస్‌టుడే: భవిష్యత్తులో రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఆయన తన ప్రకటనలో.. కవరపేటలో గూడ్సు రైలును ప్యాసింజర్ రైలు ఢీకొన్న ప్రమాదం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. క్షతగాత్రులకు ఉన్నతమైన చికిత్స అందించాలని డిమాండు చేశారు. ప్రమాదంలో మరణాలు లేకపోవడం ఊరట కలిగించే విషయమన్నారు. ఒకింత భద్రతను తలపించిన దక్షిణ రైల్వే వ్యవస్థలోనూ ప్రమాదాలు పెరగడం అప్రమత్తం చేస్తోందని తెలిపారు. పండగ సమయాల్లో జరిగిన ప్రమాదం పలువురి ప్రయాణాల ప్రణాళికను దెబ్బతీసిందని పేర్కొన్నారు. ఆరు రోజులకు ఓ ప్రమాదం చొప్పున రైల్వే శాఖ ఉండటం చాలా ప్రమాదకరమన్నారు. ఇది కేంద్రంలోని భాజపా ప్రభుత్వ పాలన అసమర్థత, నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు. ఇకనైనా అప్రమత్తంగా వ్యవహరించి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

కమ్యూనిస్ట్ పార్టీలు అన్నాడీఎంకే కూటమికి వెళ్లవు: ముత్తరసన్



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే కూటమిలోకి కమ్యూనిస్ట్ పార్టీలు వెళ్లవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ తెలిపారు. ఆయన దిండుక్కల్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... తమిళనాడులో మూఢనమ్మకాలు పెరుగుతున్నాయని చెప్పారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని ప్రచారం చేస్తూ ప్రజల దృష్టి మరల్చుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదన్నారు. రూ.7వేల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి రూ.33వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. విద్యాశాఖకు రూ.5,263 కోట్ల నిధులు అందలేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధానిని కలిసి మూడు వినతులను ముందుంచారన్నారు. కానీ, అందులో కోరినట్లు విద్యాశాఖకు నిధులు ఇవ్వనందున ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. అలానే జాలర్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. డీఎంకే కూటమిలో ఉన్నవారు అన్నాడీఎంకే కూటమికి వచ్చేస్తారని దిండుక్కల్ శ్రీనివాసన్ కలలు కంటున్నారని, అవి ఎప్పటికీ నెరవేరవన్నారు.

టీవీకే మహానాడుకు భారీగా ఏర్పాట్లు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా విక్రవాండి సమీప వి.సాలైలో తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు ఈనెల 27న జరుగనుంది. ఇందుకుగాను వేదిక నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేదిక నిర్మాణం పూర్తికావడంతో అలంకరణ పనులు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలోని ముళ్ల చెట్లను తొలగిస్తున్నారు. ప్రాంగణంలో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయడానికి 3 వేల స్తంభాలను నాటుతున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే కార్యకర్తలు సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లకుండా ఇనుప కమ్ములను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసుల సూచనల మేరకు ఆ ప్రాంతంలో ఉన్న నేల బావిపై ఇనుప కమ్ములను ఏర్పాటు చేశారు. ప్రాంగణ ప్రవేశ ద్వారాన్ని జార్జ్ కోటలాగా రూపొందించారు.

కోయంబేడు మార్కెట్‌లో వాననీటి కాలువ నిర్మాణం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కోయంబేడు మార్కెట్‌లో వాననీటి సమస్య పరిష్కారానికి రూ.15 కోట్లతో కాలువ నిర్మించనున్నట్లు సీఎండీఏ ఛైర్మన్, మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఆయన ఆదివారం కోయంబేడు వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. కోయంబేడు టోకు మార్కెట్ ప్రాంగణంలో నిలుస్తున్న వాననీటిని తొలగించేందుకు మొదటి విడతగా రూ.15 కోట్ల వ్యయ అంచనాతో కాలువ నిర్మాణానికి ఒప్పందాలు కుదుర్చుకొని రుతుపవనాల వర్షానికి అనుగుణంగా పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ముందే నిర్మించిన 850 మీటర్ల కాలువను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కోరారని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మూడుచోట్ల బహిరంగ సభలకు ఏర్పాట్లు: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ మూడు చోట్ల బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ప్రభుత్వ అవకతవకలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం బాధ్యతాయుత రాజకీయ పార్టీ బాధ్యత అని తెలిపారు. ఆ బాధ్యత నెరవేర్చే విధంగా ప్రజా వ్యతిరేక డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగ సభలు నిర్వహించేందుకు పీఎంకే తీర్మానించిందన్నారు. ఆ మేరకు మొదటి విడతగా మూడు బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీ సాయంత్రం చిదంబరం, విరుదాచలంలో, 20న దిండివనం, 26న సేలంలో జరుగుతాయని చెప్పారు. సభల్లో తాను, అధ్యక్షుడు అన్బుమణి, గౌరవాధ్యక్షుడు జీకే మణి, వన్నియర్ సంఘ అధ్యక్షుడు అరుళ్‌మొళి తదితరులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు.

వర్షాలు ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ మంత్రి రామచంద్రన్ తెలిపారు. ఆయన శనివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలను ఎదుర్కోవడానికి అన్నివిధాలుగా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ కేంద్రం హెచ్చరించిందని పేర్కొన్నారు. ఆ మేరకు అన్నివిధాలా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వర్షాలు రాకముందే సరకులను చౌక దుకాణాలకు పంపడానికి చర్యలు తీసుకొన్నామని వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి రామచంద్రన్

ఘనంగా తిరువళ్లువర్ వర్సిటీ స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా కాట్పాడి సమీప సేర్కాడులోని తిరువళ్లువర్ విశ్వవిద్యాలయంలో 19వ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కోవి.చెళియన్ అధ్యక్షత వహించారు. గవర్నర్ ఆర్.ఎన్.రవి ముఖ్య అతిథిగా హాజరై 146 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ సెంథిల్‌వేల్‌మురుగన్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొన్నారు.

ఆహారం నాణ్యతగా లేకుంటే వాట్సప్‌లో ఫిర్యాదు చేయండి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఆహారం నాణ్యతలేకుంటే వాట్సప్ ద్వారా ఆహార భద్రతశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని శాఖ అధికారి సతీష్‌కుమార్ తెలిపారు. దీని గురించి ఆయన మాట్లాడుతూ... హోటళ్లు, రోడ్డు పక్కన దుకాణాలు, వసతిగృహాలు తదితర చోట్ల తినే ఆహారం నాణ్యంగా లేకుంటే వెంటనే ఆహార భద్రతాశాఖకు తెలియజేయాలన్నారు. సులభంగా ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా సెల్‌ఫోన్ నెంబర్‌ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలు తాము తినేచోట పాడైన, నాణ్యతలేని ఆహారాన్ని గుర్తిస్తే వెంటనే 94440 42322 అనే నెంబర్‌కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అందులో పాడైన ఆహారం ఫొటో లేదా వీడియో పంపి మేసేజ్ చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన 48 గంటల్లోగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంటాయని చెప్పారు.

'రైల్వేశాఖ నిర్లక్ష్యమే కారణం'



మాట్లాడుతున్న ఎంపీ శశికాంత్ సెంథిల్

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: కవరైపేట రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఎంపీ శశికాంత్ సెంథిల్ ఆరోపించారు. ఆయన ఘటనా స్థలిని ఆదివారం సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదం తర్వాత కూడా సదరుశాఖ అధికారులు నిద్రావస్థ నుంచి మేలుకోలేదని కవరప్పేట ఘటన రుజువు చేస్తోందని మండిపడ్డారు. రైలు పట్టాలపై ఆధునిక సాంకేతిక పరికరాలు పొందుపరచడంతో దేశంలో ఇకపై రైలు ప్రమాదాలు జరగవని కేంద్ర రైల్వేశాఖ మంత్రి గొప్పలు పలికిన కొద్ది రోజుల్లోనే ఇక్కడ ప్రమాదం చోటుచేసుకుందని గుర్తుచేశారు. పనిభారం కారణంగా విధులపై సరిగా దృష్టిసారించలేకపోతున్నామని లోకోపైలట్లు వాపోతుండడాన్ని దృష్టిలో పెట్టుకోవాలని హితవు పలికారు. క్షతగాత్రులను రక్షించడంతో స్థానికులు కీలకపాత్ర పోషించడం ప్రశంసనీయమన్నారు.


మహాబలిపురం: కల్పాక్కం అణు విద్యుత్తు కేంద్రంలో దుర్గమ్మకు పూజలు


పళ్లిపట్టు: రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి


తిరువణ్ణామలై: మహిషాషురమర్దినిగా పరాశక్తి


ప్యారిస్: లలితా మనోహరి బృందం గీతాలాపన


ప్యారిస్: ఉభయకర్తలను సత్కరిస్తున్న శంకరరావు దంపతులు


కాంచీపురం: కలెక్టరేట్ సమీప ఎల్లప్పనగర్‌లోని యూరో కిడ్స్ పాఠశాలలో బొమ్మల కొలువు

వైభవంగా విజయదశమి వేడుకలు

ప్యారిస్: జార్జిటౌన్‌లోని దక్షిణ ఇండియా వైశ్య సంఘంలో విజయదశమితో పాటు పురటాసి మాస శనివారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి, శ్రీ కన్యకా పరమేశ్వరి చిత్రపటాలు ఏర్పాటు చేసి ఆరాధనలు చేశారు. మహిళా సభ్యులు శ్రీవిష్ణు సహస్రనామం, శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం సంగీతాచార్యులు దోగుపర్తి ఉపేంద్ర గుప్తా నిర్వహణలోని లలితా మనోహరి బృందం అన్నమాచార్యుల కీర్తనలను ఆలపించింది. సంఘ అధ్యక్షులు, అజంతా అధినేత డాక్టర్ శంకరరావు దంపతులు అతిథులుగా పాల్గొని మహిళలకు సుమంగళి ప్రసాదాలు అందజేశారు. కార్యదర్శులు నరసింహులు, అశోక్‌కుమార్, కోశాధికారి రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉపాధ్యక్షులు ఉదయ్‌కుమార్, జీవీవీ సుబ్బారావు, కాశీవిశ్వనాథంతో పాటు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కాంచీపురం: హయగ్రీవాలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న భట్టాచార్యులు

ప్యారిస్: జార్జిటౌన్‌లోని శ్రీ అక్షయ సాయి బాబా మందిరంలో విజయదశమి సందర్భంగా శ్రీ గణపతి, లక్ష్మి, దుర్గ, సరస్వతి, సాయినాథ హోమాలు నిర్వహించారు. మందిరం నిర్వాహకులు అజంతా అధినేత డాక్టర్ శంకరరావు, ఆయన సతీమణి విజయలక్ష్మి పాల్గొని ఉత్సవ ఉభయదారులు తిరుమల ట్రేడర్స్ అధినేత పి.పుష్పరాజ్, కృష్ణవేణిని సత్కరించారు.

అక్షరాభ్యాస కార్యక్రమాలు

కాంచీపురం: కాంచీపురం విలక్కొలి పెరుమాళ్ ఆలయం సమీపంలోని పరకాల మండపంలో ఉన్న హయగ్రీవ సన్నిధిలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ భట్టాచార్యులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా లక్ష్మీహయగ్రీవుడికి ప్రత్యేక పూజలు చేశారు.

వేళచ్చేరి: విజయదశమి సందర్భంగా విళుపురం ఆంజనేయ ఆలయంలో పిల్లలకు శనివారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న హయగ్రీవుడికి ప్రత్యేక పూజలు చేశారు.

కోయంబత్తూరు: కోయంబత్తూరులోని అయ్యప్పస్వామి ఆలయాల్లో అక్షరాభ్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు పిల్లలతో అక్షరాలను రాయించారు. ఇలా 20కి పైగా ఆలయాల్లో సుమారు వంద మందికి అక్షరాభ్యాసం నిర్వహించారు.

మహాబలిపురం: చెంగల్పట్టు జిల్లా కల్పాక్కంలోని అణు విద్యుత్తు కేంద్రంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఇంజినీర్లు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న బెంగాలీలు దసరా సందర్భంగా మహిషాసురమర్దిని, శివుడు, పార్వతి, వినాయకుడు విగ్రహాలను ప్రతిష్ఠించి 9 రోజుల పాటు పూజించారు. శనివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు.

తిరువణ్ణామలై: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో పరాశక్తి అమ్మవారికి శనివారం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. సాయంత్రం అమ్మవారిని మహిషాషురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

పళ్లిపట్టు: పళ్లిపట్టు బజారువీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి పుష్ప పల్లకిలో పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులిచ్చారు.


కోయంబత్తూరులో..

అష్టభుజ పెరుమాళ్‌కు బంగారు కిరీటం కానుక

కాంచీపురం: కాంచీపురం రంగసామి కొలనుకు సమీపంలోని ప్రసిద్ధ అష్టభుజ పెరుమాళ్ ఆలయం 108 దివ్య దేశాల్లో ఒకటి. ఇదిలా ఉండగా ఇక్కడి పుష్పవల్లి సమేత అష్టభుజ పెరుమాళ్‌కు కాంచీపురానికి చెందిన భక్తులు బీఎం మిథులన్, పళని, గోవిందరాజ్, నారాయణన్ తదితరులు 6,400 గ్రాముల బరువు ఉన్న రూ.7 లక్షల విలువచేసే బంగారు కిరీటాన్ని పెరటాసి 4వ శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ట్రస్ట్ కమిటీకి కానుకగా సమర్పించారు. అనంతరం కిరీటాన్ని స్వామివారికి అలంకరించారు.


భక్తులు సమర్పించిన బంగారు కిరీటం

భక్తిశ్రద్ధలతో 'కత్తిపోడుం' తిరునాల

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులోని పురాతన రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో 'కత్తిపోడుం' (భక్తులు కత్తులతో ఒంటిపై కొట్టుకునే) తిరునాల వైభవంగా ఆదివారం నిర్వహించారు. స్థానిక పువ్వుల మార్కెట్ నుంచి ఊరేగింపుగా భక్తులు బయలుదేరారు. కత్తులతో చేసుకునే గాయాలు అమ్మవారి అనుగ్రహంతో 3 రోజుల్లో తగ్గుతాయన్న నమ్మకం భక్తుల్లో ఉంది.


కత్తులతో ఒంటిపై గాయపరుచుకుంటున్న భక్తులు

కనులపండువగా పార్వేట ఉత్సవం

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో విజయదశమిని పురస్కరించుకుని శనివారం రాత్రి పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని సింహ వాహనంపై మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. ముందుగా శమీవృక్ష పూజ నిర్వహించారు. అమ్మవారిని విమానంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు నుంచి వచ్చిన మైలార్ల ప్రభకట్టి వాసవి దండకం పారాయణం చేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినులు జ్యోతులు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. తెల్ల గుర్రాలు, రఘురామన్ బృందం నాదస్వరం, కేరళ యువకుల లయ విన్యాసం అలరించాయి. దేవాలయ వంశ పారంపర్య ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్‌తో పాటు పాలక మండలి సభ్యులు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్‌బాబు, తాతా బద్రీనాథ్‌లు ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.


మహిషాసురమర్దినిగా కన్యకాపరమేశ్వరి

చెన్నై చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఈ ఏడాది రాష్ట్రంపై అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అరక్కోణం నుంచి జాతీయ విపత్తు నిర్వహణ బృందాలు చెన్నైకు చేరుకున్నాయి. ఒక్కో బృందంలో 30 మంది చొప్పున 10 బృందాలు ఉన్నాయి. అంతేకాకుండా అరక్కోణం ఎన్డీఆర్ఎఫ్ కేంద్రంలో అత్యవసర కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఫైబర్ బోట్లు, పరికరాలతో చెన్నైలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ కేంద్రం పర్యవేక్షణలో ఎన్డీఆర్ఎఫ్ వర్గాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి.

ప్రత్యేక సంతలో రూ.17 కోట్ల వ్యాపారం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఆయుధపూజ పురస్కరించుకొని కోయంబేడు మార్కెట్‌లో వ్యాపారం జోరుగా సాగింది. పండ్ల మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్కెట్, ప్రత్యేక సంతలో రూ.17 కోట్ల వ్యాపారం జరిగినట్లు సమాచారం. కోయంబేడు మార్కెట్‌లో పూజ వస్తువులు తక్కువ ధరకు ఒకే ప్రాంతంలో లభించే విధంగా ప్రత్యేక సంత ఏర్పాటు చేశారు. ఈ సంతకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇక్కడ తిరువణ్ణామలైతో పాటు ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు వస్తువులు విక్రయించారు. వర్షం కురిసినా చెన్నై, శివారు ప్రాంతాలకు చెందిన చిల్లర వ్యాపారులు, ప్రజలు వస్తువులు కొనుగోలు చేశారు. లారీల ద్వారా పలు ప్రాంతాల నుంచి పలు రకాల వస్తువులు సంతకు చేరాయి. మూడు రోజుల్లో రూ.17 కోట్ల విక్రయాలు జరిగాయి.

భారీవర్షం.. స్తంభించిన జనజీవనం


ప్యారిస్: బాధితులను రక్షించినవారిని అభినందించిన ఏడీజీ డేవిడ్సన్ దేవాశీర్వాదం

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురుస్తోంది. దీంతో మీనాక్షి అమ్మన్ ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల్లోకి నీరు చేరింది. అక్కడక్కడ నిలిపి ఉంచిన వాహనాలు నీట మునిగిపోయాయి. మదురై రైల్వేస్టేషన్, విమానాశ్రయం, ఆరపాళయం మొదలైన ప్రాంతాల్లో వరదనీరు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. వాహనాలు ఎటూ వెళ్లలేక చోదకులు అవస్థలు పడ్డారు. మణినగరం వర్కుషాప్ రోడ్డు ప్రాంతంలో ఉన్న వంతెన కింద 5 అడుగుల మేర నీరు చేరడంతో ఆ వైపుగా వచ్చిన పోలీసు వాహనం చిక్కుకుంది. అందులో ఉన్న పోలీసులు ఈదుకుంటూ బయటకు వచ్చారు. ఆ తర్వాత వచ్చిన మరో కారు చిక్కుకుంది. అందులో ఉన్న ముగ్గురిని పోలీసులు రక్షించారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని మోటార్ల ద్వారా తొలగించారు. బాధిత ప్రాంతాల్లో మేయర్ ఇంద్రాణి, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, అధికారులు పర్యటించారు. వాననీటిలో కారులోపల చిక్కుకున్న వారిని కాపాడిన కానిస్టేబుల్ తంగముత్తు, కార్తిక్, చంద్రశేఖర్‌కు అదనపు డీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం బహుమతి అందజేసి అభినందించారు.

విల్లివాక్కం: నీలగిరి జిల్లా కున్నూర్, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. కున్నూర్-మేట్టుపాళయం కొండ ప్రాంతంలోని కొయ్య వంతెన సమీపంలో మట్టి జారిపడటంతో పాటు చెట్లు విరిగిపడ్డాయి. కున్నూర్ డీఎస్పీ వీరపాండి, ఇన్‌స్పెక్టర్ సతీష్, రహదారుల శాఖ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మట్టిని, విరిగిపడిన చెట్లను తొలగించారు. కున్నూర్ సిమ్స్ పార్కు, అడార్ రోడ్డుపై భారీ వృక్షం విద్యుత్తు తీగలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది. అగ్నిమాపక సిబ్బంది చెట్టును తొలగించారు. చెట్ల కింద వాహనాలు నిలపరాదని రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు సూచించారు. ఊటీలో ఆదివారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. ప్రస్తుతం సెలవు రోజులు కావడంతో పర్యాటకుల రాక పెరిగింది.


విల్లివాక్కం: రోడ్డుపై కూలిన భారీవృక్షం


ప్యారిస్: నీటిలో చిక్కుకున్న కారు


ప్యారిస్: రోడ్డుపై నిలిచిన వాననీరు

'మోహన్ భగవత్ వ్యాఖ్యలు అభ్యంతరకరం'

చెన్నై, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ వ్యాఖ్యలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఖండించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ ర్యాలీలో అధ్యక్షుడు మోహన్ భగవత్ ప్రసంగం మత విద్వేషాలు, మత కల్లోలాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని తెలిపారు. భారతదేశం హిందువులకు మాతృదేశం అని, ఇక్కడ మైనారిటీలైన ముస్లింలు, క్రైస్తవులు జీవించాలంటే భారత సంస్కృతిని పాటించాలని మాట్లాడటం సరికాదన్నారు. సామాజిక సమైక్యతకు గొడ్డలిపెట్టుగా ఉన్న వ్యాఖ్యలను సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

రూ.కోటి విలువజేసే 'కాలా' అశ్వం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా మేట్టుపట్టిలో 17 ఎకరాల విస్తీర్ణంలో వీర వరదరాజన్ అనే వ్యక్తి వ్యవసాయ క్షేత్రం ఉంది. ఇక్కడ కోళ్లు, పశువులు, చిన్నగా ఉండే కాంగేయం ఆవులు, టర్కీ, ఈము కోళ్లు, ఒంటె, పలు రకాల పక్షులు, కుక్కలను పెంచుతున్నారు. ప్రత్యేకంగా మూడు గుర్రాలను పోషిస్తున్నారు. ఇవి సాధారణ గుర్రాలతో పోలిస్తే పొడవుగా చూపరులను ఆకర్షించే విధంగా ఉన్నాయి. వీర వరదరాజన్ మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లిన సమయంలో అక్కడి జంతువులను కొనుగోలు చేసి పాలలో పెంచుతామని తెలిపారు. 'కాలా' అనే కతియావార్ గుర్రాన్ని ముంబయిలో జరిగే ఉత్సవానికి తీసుకెళ్లగా రూ.కోటికి అడిగారని, తాను ఇష్టంగా పెంచుకోవడంతో విక్రయించలేదని చెప్పారు.


గుర్రంతో వీర వరదరాజన్

బోట్‌హౌస్‌లో పర్యాటకుల సందడి

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా చెయ్యూర్ సమీప మొదలియార్‌కుప్పం గ్రామంలో తమిళనాడు పర్యాటకాభివృద్ధి సంస్థ తరఫున రెయిన్ ట్రాప్ బోట్ హౌస్ పనిచేస్తోంది. సెలవు రోజుల్లో చెన్నై, పుదుచ్చేరి, శివారు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి సరస్సుల్లో పడవల్లో విహరిస్తూ బీచ్‌లో ఏర్పాటు చేసిన విశ్రాంతి గూడారాల్లో సేద తీరుతుంటారు. బోట్ హౌస్‌లోని పలు రకాల బోట్లలో కుటుంబ సమేతంగా షికారు చేస్తున్నారు. ఇటీవల కొత్తగా ప్రారంభించిన డిస్కో బోట్‌కు ఆదరణ పెరిగింది. ప్రస్తుతం వరుస సెలవులు కావడంతో మూడు రోజులుగా బోట్ హౌస్‌కు పర్యాటకు తాకిడి పెరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప ప్రియాంకుప్పానికి చెందిన దయానిధి (31) ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతను శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఉళుందై వద్ద అదుపుతప్పిన వాహనం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మప్పేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప వేప్పంపట్టు రైల్వేస్టేషన్ వద్ద శనివారం రాత్రి ఓ వృద్ధుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉద్యోగి...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప నుంగంబాక్కానికి చెందిన పంచాక్షరం (53) వేప్పంపట్టులోని పీహెచ్‌సీలో పనిచేస్తున్నాడు. ఇతను విధుల నిమిత్తం ఆదివారం మనవాళనగర్‌కు చేరుకోగా ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు అతన్ని తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. రక్తపోటు అధికమవడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



మినీ బస్సు బోల్తా.. 14మందికి తీవ్రగాయాలు

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పాలమంగళం గ్రామం నుంచి ఓ మినీబస్సు బయలుదేరింది. శనివారం రాత్రి పళ్లిపట్టు సమీపంలోని కల్లామేడు కాలనీ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ప్రమాదంలో మునియమ్మాల్ (32), తేజశ్రీ (18), నెసంత్ (4), ధనలక్ష్మి (8) సహా 14మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని పళ్లిపట్టు పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఏడుగురికి...

రెడ్‌హిల్స్: పూందమల్లి సమీప శక్తినగర్‌కు చెందిన కుమార్ ఇంట్లో ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం ఓ కార్మికుడు వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ ఆన్‌చేయగా అకస్మాత్తుగా పేలింది. ఘటనలో కార్మికులు కుమార్, జగన్, సరస్వతి, షీలా, నీలకుమార్, ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ సహా ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్టు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా పెరుందురై పణిక్కంపాలయం ప్రాంతంలో బంగ్లాదేశ్‌కు చెందిన వారు చట్టవిరుద్ధంగా బస చేస్తున్నట్టు పెరుందురై పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు ఆ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 25 మందికి పైగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అందులో కొందరు బంగ్లాదేశ్‌కి చెందిన వారిగా గుర్తించారు. మహమ్మద్ ఒలి ఉల్లా, మహమ్మద్ సాహిబ్ హుస్సేన్, ఫారుక్ హుస్సేన్, మహమ్మద్ మిస్టర్ అలీ, మోంజిల్ హుస్సేన్, మహమ్మద్ అన్వర్ హుస్సేన్, ఫాతిమా వీసా గడువు ముగిసినా దేశంలో ఉన్నట్టు తెలిసింది. దీంతో ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు ఈరోడ్ కోర్టులో హాజరుపరిచి శనివారం పుళల్ జైలుకు తరలించారు.


పోలీసుల అదుపులో బంగ్లాదేశీయులు

కిడ్నాప్ కేసులో ఇద్దరు...

ప్యారిస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లాకు చెందిన దినేష్ చెన్నై వడపళనిలో ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనితో పాటు పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కి చెందిన భాస్కర్‌తో కలిసి 10వ తేదీ తెల్లవారుజామున దురైసామి సాలైలో నడుచుకుంటూ వెళ్తుండగా కారులో వచ్చిన దుండగులు దినేష్‌ని బలవంతంగా కారులో ఎక్కించి తీసుకెళ్లారు. భాస్కర్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సీసీ కెమెరాల సాయంతో దర్యాప్తు చేశారు. తిరుపతి రోడ్డులో ఆగి ఉన్న కారును గుర్తించారు. అందులోని దినేష్‌ని కాపాడి, కారుని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కిడ్నాప్‌కి పాల్పడిన సురేంద్రరెడ్డి, కడపకి చెందిన వెంకట జయ మణికంఠను అరెస్టు చేశారు. దర్యాప్తులో.. సురేంద్రరెడ్డి వద్ద దినేష్ అప్పు చేశాడని, తిరిగి ఇవ్వకపోవడంతో స్నేహితులతో కలిసి కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. నిందితులు ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.


సురేంద్రరెడ్డి, వెంకట జయ మణికంఠ

నాటు తుపాకీ కలిగిన వ్యక్తి...

విల్లివాక్కం: ఈరోడ్ శక్తిసాలైలో వేణుగోపాల్ అనే వ్యక్తికి చెందిన వసతి గృహం ఉంది. ఇందులో గత సెప్టెంబరు 23 నుంచి 25వ తేదీ వరకు ఇద్దరు వ్యక్తులు బస చేసి గదిని ఖాళీచేసి వెళ్లిపోయారు. వారు ఉన్న గదిని సిబ్బంది శుభ్రం చేస్తుండగా దిండు కింద నాటు తుపాకీ, 6 తూటాలు కనిపించాయి. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని వాటిని స్వాధీనం చేసుకుని వసతి గృహం మేనేజరు, సిబ్బంది వద్ద దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా వారి కోసం గాలింపు చేపట్టారు. రెండు ప్రత్యేక పోలీసు బృందాలు దిల్లీకి వెళ్లి నిందితుడు సారిబ్‌ఖాన్ (24)ను అరెస్టు చేసి ఈరోడ్‌కు తీసుకొచ్చి దర్యాప్తు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.

బిడ్డను విక్రయించిన తల్లి...

ఆర్కేనగర్: తిరువారూర్‌కు చెందిన 35ఏళ్ల మహిళ భర్త ఏడేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి తన 14, 13 ఏళ్ల వయసున్న ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఇదిలా ఉండగా ఈమెకు అదే ప్రాంతానికి చెందిన 25ఏళ్ల యువకుడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతని కారణంగా గర్భం దాల్చింది. 10నెలల క్రితం ఓ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని సాయంతో ఆ బిడ్డను రూ.లక్షకు అదే ఊరిలో ఉంటున్న ఓ వ్యక్తికి విక్రయించింది. స్థానికులు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. జిల్లా బాలల సంక్షేమ అధికారి సెల్వం నేతృత్వంలో అధికారులు విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బిడ్డను విక్రయించిన మహిళ, ఇంటి యజమానిని ఆదివారం అరెస్ట్ చేశారు.



లబ్ధిదారులతో ఎలక్ట్, చెల్లకృష్ణ తదితరులు

పేదలకు గృహాల అప్పగింత

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప బొమ్మిజికుళంలో యానాది తెగకు చెందిన వారు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. వీరు గుడిసెల్లో నివసిస్తుండడాన్ని మద్రాసు రోటరీ క్లబ్ నిర్వాహకుల దృష్టికి వెళ్లింది. దీంతో యానాదులకు 220 చదరపు అడుగుల విస్తీర్ణంతో 29 కాంక్రీట్ గృహాలను రూ.1.04 కోట్ల వ్యయంతో నిర్మించారు. వీటిని లబ్ధిదారులకు అప్పగించే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. రోటరీ క్లబ్ గవర్నర్ ఎలక్ట్ అధ్యక్షత వహించి ఇంటి తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఛైర్మన్ చెల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఖైదీ ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా తిరువైయారుకు చెందిన రమేష్ (46) తన కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయ్యి పుదుకోట్టై జిల్లా జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఇతను శనివారం ఉన్నట్టుండి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో జైలు సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో పురుగుల మందు తాగిన రోగికి చికిత్స అందించేందుకు తీసుకొచ్చిన పురుగులమందు నమూనాను రమేష్ తాగాడు. విషయం తెలుసుకున్న వైద్యులు ఐసీయూలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నారు.

రైలులో మత్తుమందు కలిపిన కాఫీ ఇచ్చి అగంతకుడి చేతివాటం

భార్యాభర్తల వద్ద నగదు, నగల చోరీ

వేలూర్, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం సయన్‌కుళానికి చెందిన షైనీ హోసూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతని తండ్రి రాజు, తల్లి మేరీ రైల్లో శుక్రవారం రాత్రి హోసూరుకు బయలుదేరారు. ఇందుకోసం జోలార్‌పేట వరకు టికెట్టు కొనుగోలు చేశారు. ఎర్నాకుళంలో ఓ ప్రయాణికుడు ఇచ్చిన కాఫీని తాగడంతో నిద్రలోకి జారుకున్నారు. ఇదే అదనుగా ఆ వ్యక్తి మేరీ మెడలోని 5 సవర్ల నగలు, 10 వేల నగదు కాజేసి పారిపోయాడు. రైలు శనివారం సాయంత్రం జోలార్‌పేటకు చేరుకోగా షైనీ స్టేషన్‌కు వచ్చి బోగీలో చూడగా తల్లిదండ్రులు నిద్రలో ఉన్నారు. నగలను చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో చోరీ

వేళచ్చేరి: అరియలూర్ పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు వెళ్లే మార్గంలో ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆసుపత్రి ఉంది. ఆయుధపూజ సందర్భంగా శుక్రవారం ఆసుపత్రిలో పూజలు నిర్వహించి త్వరగా మూసేసి వెళ్లారు. శనివారం ఉదయం తెరవడానికి వచ్చిన సిబ్బంది భవనం వెనుక వైపున ఉన్న తలుపులకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. లోనికెళ్లి చూడగా సుమారు రూ.30 వేల విలువైన మందులు, డబ్బు చోరీకి గురైనట్లు గుర్తించారు. వైద్యుల ఫిర్యాదు మేరకు అరియలూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

విమానాశ్రయంలో కిలో బంగారం స్వాధీనం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయానికి శుక్రవారం కౌలాలంపూర్ నుంచి వచ్చిన ప్రయాణికుల లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఓ ప్రయాణికుడి లోదుస్తుల్లో దాచి తెచ్చిన బంగారాన్ని గుర్తించారు. దర్యాప్తులో ఓ వ్యక్తి కౌలాలంపూర్ విమానాశ్రయంలో తనకు ఇచ్చి చెన్నైలో వేరొకరికి ఇవ్వమని చెప్పినట్లు నిందితుడు తెలిపాడు. కిలో బరువున్న రూ.72 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.